గులాబీ నేతల్లో.. అంతర్మథనం !



- రోజురోజుకు తగ్గుతున్న 'కారు' గ్రాఫ్
- హస్తం వైపు చూస్తున్న బీఆర్‌ఎస్ ప్రతినిధులు



భట్టి సమక్షాన కాంగ్రెస్‌లో చేరిన మధిర ఎంపీపీ మెండెం లలిత(ఫైల్)

మధిర: మధిర నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు వెళుతుండడంతో గులాబీ శ్రేణుల్లో అంతర్మథనం మొదలైంది. నియోజకవర్గంలోని చింతకాని, మధిరలో అధికార పార్టీకి చెందిన ఎంపీపీలు, కాంగ్రెస్ గూటికి చేరడంతో బీఆర్‌ఎస్ పార్టీకి తీవ్ర షాక్ తగిలింది. అంతేకాకుండా కొన్ని మండలాల్లో గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, తదితర ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు.

సమన్వయం చేసుకోవడంలో వైఫల్యం..

రెండు నెలల ముందే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. ఆ పార్టీ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడంలో వైఫల్యం చెందారని ఆ పార్టీ నేతలే చర్చించుకోవడం గమనార్హం. కమల్‌రాజ్ గెలుపు కోసం ముఖ్యమంత్రి మధిరకు వచ్చినప్పటికీ ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించడం లేదు. అభ్యర్థి అంతా తానై పని విభజన చేయకుండా తన కనుసన్నల్లోనే పార్టీ ప్రచారం జరగడం వల్ల ఆ పార్టీ ముఖ్య నాయకుల్లో అసంతృప్తి నెలకొంది.

ప్రాధాన్యత ఇవ్వకపోవడమే ప్రధాన కారణం..

అధికార పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆయనే స్వయంగా వచ్చి ఆయా పనులు పూర్తి చేసి వెళుతుండడంతో క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులుగా ఉన్న తమకు తీవ్ర అసంతృప్తిగా ఉందని వారు బహిరంగంగా చెబుతున్నారు. ప్రచార నిర్వహణ కోసం ఎటువంటి కమిటీలను ఏర్పాటు చేయకపోవడం, వారికి సంబంధించిన ఆర్థిక వెసులుబాటు కల్పించకపోవడం తదితర కారణాలతో పార్టీ శ్రేణులను నిరాశకు గురిచేస్తుంది. కమల్‌రాజ్ తరపున ప్రచారం చేసేందుకు ఈ నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా ఉన్న జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి మధిరవైపు కన్నెత్తి చూడటం లేదు. ముఖ్యమంత్రి రాకకు ఒకరోజు ముందు ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక మండలంలో ప్రచారంలో పాల్గొని వెళ్లిపోయారు. అయితే మంత్రి అజయ్ కుమార్‌కు ప్రాధాన్యత కల్పిస్తూ తమను మధిర నియోజకవర్గానికి ప్రచారంలో పాల్గొనేందుకు ఆహ్వానించడం లేదని వారు గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

రోజురోజుకూ తగ్గుతున్న ఆదరణ..

గతంలో జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో ఆనాడు అధికార పార్టీలో ఉన్న మధిరకు చెందిన డాక్టర్ కోట రాంబాబు సహకారంతో జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికై అధికార పార్టీలో కొనసాగుతున్నారు. ఆ తర్వాత జరిగిన మధిర మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు రాంబాబు అవకాశం కల్పించమని అడిగితే కమల్‌రాజ్ ఇవ్వలేదు. దీంతో డాక్టర్ రాంబాబు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2018 ఎన్నికల్లో రాంబాబు బీఎల్‌ఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి 22 వేల ఓట్లు సాధించారు. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గం నుంచి బలమైన నేతగా గుర్తింపు పొందారు. ఓట్లు ప్రస్తుతం రాంబాబుతో పాటు కాంగ్రెస్ పార్టీకి బదిలీ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులపై విశ్వాసం, కృతజ్ఞత తగ్గిందని ఆరోపిస్తున్నారు.

దూసుకెళ్తున్న భట్టి..

మల్లు భట్టి విక్రమార్కకు మంచి పేరు ఉందని, ఆయన గెలుపు కోసం తగిన వ్యూహాలను పకడ్బందీగా అమలు చేస్తారని పలువురు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి క్షేత్రస్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలించి ఆ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు రూపకల్పన చేయడం, అధిష్టానాన్ని ఒప్పించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క మధిర నుంచి గెలుపొంది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మంచి పదవి దక్కే అవకాశం ఉందని, అభివృద్ధిలో మధిర దశ దిశ మారుతుందని జోరుగా చర్చ జరుగుతుంది. ఇలా అధికార పార్టీలో నిరాశ నిస్పృహలు, ప్రతిపక్ష పార్టీలో జోష్ కనిపిస్తుంది. దీనికి తోడు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ కూడా వచ్చి భట్టిని ఆశీర్వదించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది.

మీలో ఒకడిగా పనిచేశా..



భీమవరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య, నాయకులు

వేంసూరు: సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కార్యకర్తలా మీలో ఒకడిగా.. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ పని చేశానని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ జెండాను చివరి వరకు సైనికుడిలా పట్టుకొని పనిచేశా.. అభివృద్ధి కోసమే టీడీపీని వదిలి సీఎం కేసీఆర్‌తో కలిసి పని చేస్తున్నానన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రతి ఒక్క దళిత కుటుంబానికి సంక్రాంతి పండుగ కల్లా దళితబంధు అమలు చేసి తీరుతానని, లేని పక్షంలో వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగనన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, రమాదేవి, సద్గుణవతి, రాంబాబు, కుమారి, రాందాసు, మౌనిక పాల్గొన్నారు.

సండ్ర గెలుపు కోరుతూ.. చర్చిల్లో ప్రార్థనలు

కల్లూరు/కల్లూరురూరల్: బీఆర్‌ఎస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే సండ్ర తనయులు భార్గవ్, తేజలతో పాటుగా పలువురు నాయకులు ఆదివారం కల్లూరు పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదే విధంగా కల్లూరులో నిర్వహించిన ముస్లిం యూత్ ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్, మేకల కృష్ణ, నందిగామ ప్రసాద్, జయబాబురెడ్డి, వేణుబాబు, రాజశేఖర్, నాగేశ్వరావు, బుడ్డయ్య, చర్చి సంఘసభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు రజనీకాంత్, చర్చి ఫాదర్ యేసోష్‌కుమార్, నాయకులు శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు, అవినాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మండలంలోని ఎర్రబోయినపల్లిలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం పలు కుటుంబాలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరాయి. పాటుప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనాద్, రామకోటి, విజయ్, బాబురావు, మనోహరరెడ్డి, దుర్గాప్రసాద్, కిరణ్‌కుమార్, నర్సింహారావు, పి.రామకృష్ణ, నరేష్, కె.రామకృష్ణ, సమీర్, నాగరాజు, రాకేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



మట్లాడుతున్న ఎంపీ బండి పార్థసారథిరెడ్డి

తల్లాడ: సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. ఆదివారం తల్లాడలోని అన్నారుగూడెం గ్రామంలో సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపును కాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సత్తుపల్లిని ప్రత్యేక జిల్లాగా చేసి దాని రూపురేఖలు మార్చేందుకు సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. తల్లాడ పట్టణం, మండలం అభివృద్ధికి తాను ప్రత్యేక కృషి చేస్తానన్నారు. తల్లాడలో జూనియర్ కళాశాలను ఏడాది తిరగక ముందే ఏర్పాటు చేస్తానన్నారు. తల్లాడ అభివృద్ధికి కోటి రూపాయలు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. అన్నారుగూడెంలో కూడా ఏ సమస్య పరిష్కారానికైనా తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రమీల, సుధాకర్, దాసురావు, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పదికి పది స్థానాలు కాంగ్రెస్‌వే..



అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, పొంగులేటి, తుమ్మల, రాగమయి



వైరాలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

వేంసూరు: ఉమ్మడి జిల్లాలోని పదికి పది స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్కమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి విజయం కాంక్షిస్తూ సత్తుపల్లి నుంచి వేంసూరు మండలం కందుకూరు వరకు ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మర్లపాడు సెంటర్‌లో జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఈసారి ప్రజలు కాంగ్రెస్ అండగా ఉండి రాగమయిని గెలిపించాలని కోరారు. అనంతరం పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో మూడు రంగుల కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. కాగా, వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో రాగమయి ప్రచారం చేశారు. నాయకులు మట్టా దయనంద్, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, వెల్ది జగన్‌మోహన్‌రావు, మందపాటి రాఘవరెడ్డి, ఎండీ.ఫైజుద్దీన్, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, ,బండి శ్రీనివాసరెడ్డి, కనమతరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గిరిబాబు, గడిపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరెంట్ విషయంలో కేసీఆర్‌వి గాలిమాటలు..

వైరా/కొణిజర్ల: సీఎం కేసీఆర్ విద్యుత్ విషయంలో గాలి మాటలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. వైరాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004లో సీఎంగా డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రమాణస్వీకారం చేయగానే ఉచిత విద్యుత్ ఫైల్‌పైనే మొదటి సంతకం చేశారని గుర్తుచేశారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ ఆస్తులను దోచుకున్నతిన్న కేసీఆర్ కుటుంబం మళ్లీ అధికారంలోకి రాకుండా కట్టడి చేయాలని, కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడగా వైరా కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో పాటు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, నల్లమల వెంకటేశ్వరరావు, లేళ్ల వెంకటరెడ్డి, పగడాల మంజుల, బానోత్ విజయాబాయి, దొబ్బల సౌజన్య, దాసరి దానియేలు, వడ్డె నారాయణరావు, బీడీకే.రత్నం, వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, దొడ్డా పుల్లయ్య, దార్న రాజశేఖర్, కోసూరి శ్రీను, మిట్టపల్లి నాగి పాల్గొన్నారు. కాగా, కొణిజర్ల మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ ప్రచారం చేశారు. ఎంపీపీ మధు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భట్టి విక్రమార్కకు ఎన్నారైల మద్దతు

మధిర: తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో ప్రవాస భారతీయులకు చెందిన ఐఏఎఫ్ అనే స్వచ్ఛంద సంస్థ వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ఆమోదం తెలుపుతూ ఆదివారం జాబితాను విడుదల చేసింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఈ జాబితాలో మధిర నియోజకవర్గంలో భట్టి విక్రమార్కకు ఆమోదం తెలిపింది. అభ్యర్థుల గుణగణాలు, స్థానిక ప్రజల ఫీడ్ బ్యాక్, గెలిచే అవకాశం ఉన్నవారికి మాత్రమే ఆమోదం తెలిపినట్లు ఆ సంస్థ విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

వైరా: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, కరాటే తెలంగాణ ప్రెసిడెంట్ ఎగ్జామినర్ వి.చంద్రశేఖరరావు తెలిపారు. ఆదివారం వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరాటేలో ప్రతిభ కనబర్చిన 39 మంది బాలబాలికలకు బెల్టులు ప్రదానం చేశారు. ఎల్లో బెల్టులు నలుగురికి, ఆరెంజ్ బెల్టులు 10 మందికి, గ్రీన్ బెల్టు 8మందికి, బ్లూ బెల్టు 12మందికి, పర్పుల్ బెల్టు 7గురికి ప్రదానం చేశారు.

నిజాయతీగా ఓటు వేయండి



ద్విచక్రవాహనాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: ప్రజలు నిజాయతీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్తుపల్లి గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కంబంపాటి వెంకటేష్, కల్లూరు మాచవరం పాఠశాల ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ కోరారు. ఆదివారం సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వరకు ఉన్న గ్రామాలకు ద్విచక్ర వాహనాలపై ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన..

తల్లాడ: తల్లాడ బాలభారతి విద్యాలయంలో ఆదివారం ఓటు ప్రాముఖ్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు 'ఓట్ ఫర్ సూర్' ఆకృతిలో నిలబడి అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ రామారావు, మాదవి, గౌషియా, నాగరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల అక్రమాలపై నిరంతర నిఘా

- ఇప్పటి వరకు 1,550 మందిపై బైండోవర్ కేసులు
- సత్తుపల్లి రిటర్నింగ్ అధికారి అశోక్ చక్రవర్తి



మాట్లాడుతున్న ఆర్‌వో, ఏసీపీ

సత్తుపల్లిటౌన్: ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభ పరిచేందుకు డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్ చక్రవర్తి అన్నారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో ఆదివారం ఏసీపీ బి.రామానుజంతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, తహసీల్దార్లు 27 మంది, సెక్టార్ ఆఫీసర్లు, ఐదుగురు సీఐ, ఎస్సైలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ నాలుగు రోజులు ఆయా బృందాలకు కేటాయించిన ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ చేస్తారని వారు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించి అదుపులోకి తీసుకోవాల్సిందిగా ఆదేశించామని, మద్యం, డబ్బుల పంపిణీపై ఫిర్యాదులు, సమాచారం ఇచ్చేందుకు స్థానిక ఆర్‌వోలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఫిర్యాదులు చేసేందుకు నంబరు 9032829032కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అదే విధంగా ఫోన్ పే, గూగుల్ పేతో పాటు నగదు బదిలీ చేసే యాప్‌లపై నిఘా ఉందని, ఇప్పటికే ముగ్గురి అకౌంట్లు తమ దృష్టికి వచ్చినట్లు వివరించారు. నియోజవర్గంలో ఇప్పటి వరకు 1,550 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా ఏసీపీ తెలిపారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష వరకు జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తామని ఆయన హెచ్చరించారు.

సీపీఎందే ప్రజాబలం

ఎర్రుపాలెం: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని మధిర సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనబలంతో ఆ రెండు పార్టీల అభ్యర్థులు విర్రవీగుతున్నారని, ప్రజాబలంతో సీపీఎం గెలవబోతుందన్నారు. పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి వీరయ్య పాల్గొన్నారు.

చింతకాని: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మధిర నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ.. మండలంలోని పలుగ్రామాల్లో భాస్కర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాములు, సీపీఎం జిల్లా నాయకుడు రామారావు, మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు జానికిరాములు, వెంకటనర్సయ్య, రవి, సుబ్బారావు పాల్గొన్నారు.

ఓటుతో గుణపాఠం చెప్పాలి

కల్లూరు: డబ్బుతో ఓట్లు కొనాలని చూసే పార్టీలకు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి అన్నారు. ఆదివారం కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మాదినేని రమేష్, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు కృష్ణార్జునరావు, అంజయ్య, హనుమయ్య, వీరభద్రం, మోహన్‌రావు, అంజి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఒక్కసారి గెలిపించండి

కారేపల్లి: వైరా నియోజకవర్గంలో ఒక్కసారి సీపీఎంకి అవకాశమివ్వాలని ఆ పార్టీ అభ్యర్థి భూక్యా వీరభద్రం అన్నారు. ఆదివారం కారేపల్లి మండలంలో మోటర్ సైకిల్ ర్యాలీ, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సుత్తికొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్, నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేందర్, నాయకులు రామారావు, మల్లయ్య, ఏకాంబరం, మురళి, సైదులు, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు విద్యుద్దీపాల అలంకరణతో వెలుగొందాయి. కార్తీక పౌర్ణమి ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఉండటంతో ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. ఆదివారం రాత్రి మహిళలు పలు ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి, అభిషేక పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తనికెళ్ల శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



తల్లాడ: మల్లవరం ఆంజనేయ దేవాలయంలో



ముదిగొండ: అయ్యగారిపల్లిలో..

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



రామకృష్ణాపురం ప్రచారంలో మల్లు సూర్యవిక్రమాదిత్య

చింతకాని: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సంపదను ప్రజలందరికీ అందించేందుకే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను తీసుకవచ్చిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు సూర్యవిక్రమాదిత్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున, నాయకులు గోవిందరావు, అంజయ్య, రామారావు, యాదయ్య, అంజి, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామాలకు చేరుకుంటున్న ఓటర్లు



మధిర రైల్వే స్టేషన్ నుంచి వస్తున్న స్థానికులు

మధిర: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు ఆదివారం స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న యువతకు వరుసగా సెలవులు రావడంతో ఒకటి, రెండు రోజులు సెలవు పెట్టుకుని ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత తిరిగి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకొని వస్తున్నారు. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వివిధ వృత్తుల కోసం వెళ్లి స్థిరపడిన వందలాదిమంది తరలివస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లలో ప్రయాణించి మధిర రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వారిని సాక్షి పలకరించగా నూతనంగా ఓటు హక్కు వచ్చిందని, తమ ఓటు వేసేందుకు స్వగ్రామానికి వెళుతున్నామని తెలిపారు.

ఉత్సాహంగా పనిచేయాలి



బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ నామా నాగేశ్వరరావు, నాయకులు

మధిర: గులాబీ శ్రేణులు ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఉత్సాహంగా పనిచేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కోరారు. మధిర బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరిగిందని, రైతు బంధు ఆలోచన ఒక్క సీఎం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పే వారిని నమ్మవద్దని కోరారు. మూడోసారి కూడా కేసీఆర్ సీఎం అవుతారని, మధిరలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ తప్పనిసరిగా గెలుస్తారని అన్నారు.

ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు..



నంబూరికి తిలకం దిద్దుతున్న మహిళలు

సత్తుపల్లి: రాష్ట్రంలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, ఈ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని సత్తుపల్లి బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ.. ఓట్లు అభ్యర్థించారు. సత్తుపల్లిలో తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి తిలకం దిద్ది స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయుడు రాఘవరావు, మధు, రాము, వేణు, అనుషా, సాయి చందు అప్పారావు పాల్గొన్నారు.

ఓటు వేసి గెలిపించండి

వైరా: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వైరా నియోజకవర్గం నుంచి ఓటు వేసి గెలిపిచాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. ఆదివారం ఆయన వైరాలోని పలు వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలిచినా ఓడినా గత 10 ఏళ్లుగా ప్రజల మధ్యనే ఉంటున్నానన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.